# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 31 డిసెంబర్, 2025 | పేజీలు :08


## హామీలు ఒక్కటీ అమలు చేయలే!



ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్

2



## సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/మమడ :** మిగిలి ఉన్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం దాదాపు పూర్తి అయిపోయిందని తెలిపారు. మిగిలి ఉన్న చిన్న చిన్న పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బ్యారేజీ వినియోగంలోకి వస్తే దాదాపు 18 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరం అని వివరించారు. ఆయకట్టు రైతులకు అధికారులు బ్యారేజీ నిర్మాణం, ఆయకట్టు వివరాలు మ్యాపుల ద్వారా వివరించారు. పలువురు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ బ్యారేజీ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణీ, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





## అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురిక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు మంగళవారం మహా వైభవంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర నలుమూలాల నుండి భారీగా భక్తులు తరలివచ్చి శ్రీ లక్ష్మీ నృసింహుడిని వైకుంఠద్వారం నుండి దర్శించుకొని తరించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయపూర్వం 2.30 గంటల నుండి ముప్వురు స్వాముల ఆలయాలలోని మూలవిరాట్టులకు విశేష క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారంకు ఎదురుగా ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన వేదికపై శ్రీ యోగానంద, ఉగ్ర నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి వారల ఉత్సవ మూర్తులను ఆసీనులు చేయించారు. ఆ స్థాన వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాస చార్య, ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ల శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు పర్వదిన విశేష పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, తరువాయి 2లో..



## శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

### జిల్లా ఎస్పి నికిత పంత్



2

## పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం




2

## జిల్లాలో శాంతిభద్రతల విజయకేతనం

### వార్షిక నివేదికను వెల్లడించిన ఎస్పీ డా.జి.జానకి షర్మిల..



2

# హామీలు ఒక్కటీ అమలు చేయలే!

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల సంక్షేమంపై లేదని, రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో సతమతమవుతోందని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాల ద్వారా విద్యార్థుల హక్కులు సాధిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య దర్శి మచ్చ రమేష్ లు హెచ్చరించారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ నగర 11వ మహా సభ కేశ బోయిన రాము యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడితే విద్యారంగ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. విద్యారంగాన్ని విస్మరిస్తే గత ముఖ్యమంత్రులకు పట్టిన గతే రేవత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యతిరేక విధానాలను మానుకొని ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. 8, 9, తేదీల్లో కరీంనగర్ నగరంలో జరిగే జిల్లా 19వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు కేశబోయిన రాము యాదవ్, మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు కిసిరెడ్డి, సందీప్ రెడ్డి, జోష్ప, మహేశ్వరి, యునోస్, బోయిని విష్ణు, అజేయ్, నాని, శివారెడ్డి, భాను, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** అయ్యప్ప దీక్షలో కుల మతాలకు అతీతంగా అందరూ సమానమే అనే భావన ఉంటుంది. భిక్ష అనేది భక్తులకు సేవ చేయడమే కాకుండా, మానవత విలువలను, ఐక్యతను చాటుతుంది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అజారుద్దీన్ అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధానం లో మంగళవారం ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి, కుల మతాల మధ్య విభేదాలు ఉండకూడదనే విషయాన్ని చాటి చెప్పాడు. ఈ బిక్ష కార్యక్రమంలో మేడి రంజిత్ స్వామి, వేణు స్వామి, పెద్దారెడ్డి స్వామి, సమ్మారావు స్వామి, మట్టెల రాజ్‌స్వామి, స్వాములు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన చాతల్ల పోషవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతురాలి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున విషయం తెలుసుకొని ఓదార్చే మాటల కన్నా సహాయం చేసే చేతులే మిన్న అనే సంకల్పంతో గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు , యువకులు గ్రామంలోని ప్రజలు దయ హృదయంతో తోచిన విధంగా జమ చేసిన రూ.19 వేల 500 రూపాయలు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన దాతలకు మృతురాలి కుటుంబ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ ,ఉప సర్పంచ్ సిర వేణి రవి, మాజీ సర్పంచ్ రాగం శంకరయ్య ,మాజీ ఉప సర్పంచ్ వోద్నాల అంజయ్య, కొలకాని జలంధర్, బుర్ర తిరుపతి గౌడ్, కాళ్ల రమేష్ (ఆర్‌జిపి సేవా సమితి అడ్మిన్) మతులాపురం రాయమల్లు ,చాతల్ల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పి మాజీ చైర్ పర్సన్ దావా వసంత హాజరయ్యారు. ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలనంతరం ఉదయం 5.30 గంటలకు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సమక్షంలో వేలాది మంది భక్తుల గోవిందా నామస్మరణల మధ్య అర్చకులు, వేదపండితులు వైకుంఠ ద్వారం తెరిచారు. అనంతరం వీఐపీలు, భక్తులు ఉత్తరద్వారం గుండా స్వామివారాలను దర్శించుకున్నారు. భక్తుల దర్శనానంతరం వేద మంత్రోచ్చరణల మధ్య మంగళవాయిద్యాలతో స్వామివారి సేవలను ఉత్తరం ద్వారం నుండి బయటకు తీసుకువచ్చి పట్టణ వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటాలు, ఒగ్గడోలు నృత్యాకారులు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వెండి పీఠం బహుకరణ ధర్మపురి పట్టణానికి చెందిన హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా.శ్రీధర్ కస్తూరి దంపతులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 10 కిలోల వెండి పీఠాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. భక్తులకు బాదం పాలు వితరణ ముక్కోటి వేడుకలకు హాజరైన భక్తులకు 1998–99 ఎస్సెస్సి మిత్రబృందం మిత్రయాత్ ఆధ్వర్యంలో సుమారు 500 లీటర్ల బాదం పాలను భక్తులకు ఉచితంగా పంపిణీ జరిపారు. పటిష్ఠ పోలీసు బందోబస్తుజిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డిఎస్పీ రఘుచందర్ మార్గదర్శనంలో ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి ఎస్ఐలు గురక మహేష్, రవీందర్ కుమార్, ఉదయ్ కుమార్, కిరణ్ కుమార్, సతీష్‌ల అధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, పాలకమండలి అధ్యక్షులు జక్కు రవీందర్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కాంగ్రెస్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడి నియామకం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడిగా పాతదామ్ రాజుపల్లి సర్పంచ్ రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు పేట సర్పంచ్ కసుమూల వెంకటేష్ లు మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .తమపై నమ్మకం నుంచి తమను ఎన్నుకున్న వివిధ గ్రామాల సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాల్గొన్న వారిలో సర్పంచులు తేలు నరేష్ ధరం సోత్ సురేందర్,పాథకాల మానస కిరణ్, పెంట సౌజన్య శ్రీనివాస్ , గోల్కొండ కళా రమేష్, తోపారపు వసంత ,దప్పుల పద్మ నరసయ్య, తదితరున్నారు.

## ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా..

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మేజర్ గ్రామపంచాయతీ మల్లాపూర్ గ్రామానికి పరిశుభ్రంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల ప్రధాన లక్ష్యమని సర్పంచ్ చిత్యాల లక్ష్మ ణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల వెళ్లే దారిలో ఉన్న స్మశాన వాటికను దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా చెత్తను ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. అదేవిధంగా నిరుపయోగం ఉన్న నీటి తొట్టిని శుభ్రం చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, వార్డు సభ్యులు కొంపల్లి రాకేష్, ముప్పరి రమేష్, ఏనుగంటి నరేష్ భుక్య శేఖర్, నరేష్ ,రాజం షబ్బీర్, వెంకట్ రెడ్డి ,నరసయ్య చంద్రయ్య ఉన్నారు.



## పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం

**ప్రజాపక్షం/కరీంనగర్:** అధికారులు తమ పరిధిలోని పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అధ్యక్షతన మంగళవారం నవంబర్2025 నెలకు సంబంధించిన సమగ్ర నేర సమీక్షా సమావేశం కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు అందరూ తమ పరిధిలోని పెండింగ్ కేసుల డైరీలను సమర్పించి, కేసుల పురోగతిని వివరించారు. కమీషనరేట్‌లోని శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల దర్యాప్తు, మరియు రాబోయే నూతన సంవత్సర వేడుకల భద్రతా ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. 2024 వరకు పెండింగ్‌లో ఉన్న పాత కేసులు, ఈ ఏడాది నమోదైన తీవ్రమైన నేరాల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ప్రజల నుండి వచ్చే ఆన్‌లైన్ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీపీ అధికారులకు సూచించారు.ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద డ్రగ్స్ నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా, మరియు పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్, మాధవి, విజయకుమార్, వెంకటస్వామి,సతీష్‌కుమార్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## విఘాతం కలిగించే వారిపై చర్యలు

**ప్రజాపక్షం/దహేగాం/పెంచికల్‌పేట్ :** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి నికిత పంత్ ఆదేశించారు. కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్‌తో కలిసి మంగళవారం ఈస్‌గాం, పెంచికల్‌పేట్, దహేగాం పోలీస్ స్టేషన్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రాత్రిపూట పర్యవేక్షణ, పెట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని పేర్కొన్నారు.

## అనాధ బాలికలకు అండగా..



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని రేగుంట గ్రామంలో తల్లి దండ్రులను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలు అనాధలుగా మిగిలారని వారికి కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర సింగారావు సహకారంతో అండగా ఉంటామని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అన్నారు. సందర్భంగా మంగళవారం సీఎం ఆర్ సహాయ నిధి నుండి మంజూరైన 15 వేల రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా చరవాణి ద్వారా జువాడి నరసింహారావు అమ్మాయిలను పరామర్శించి మనోధైర్యం కల్పించి అండగా ఉంటామని చదువుకోవడానికి సహకారమందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజోజీ సదానంద చారి, కాంగ్రెస్ నాయకులు ఏనుగు రాజారెడ్డి ,భూమానందం ,రాజేశ్వర్రెడ్డి ,రాజారెడ్డి ,రాజేశం ,వినోద్, తదితరులున్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల కాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విష యం విది తమే. మంగళవారం మృతురాలికి నివాళులర్పించి తన కుటుంబానికి నూతన పాలకవర్గ ఆధ్వర్యంలో రూ.5016 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్, ఉపసర్పంచ్ అర్శం శ్రీనివాస్, వార్డు సభ్యులు మోరె వసంత శ్రీనివాస్, సుజాత కృష్ణ, నాని యాదవ్, అర్శం రాజయ్య, భవాని కుమారస్వామి, కర్రె కొమురయ్య, మల్లేష్, కారోబార్ మోరె మహేష్ పాల్గొన్నారు.

## జిల్లాలో శాంతిభద్రతల విజయకేతనం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేర నియంత్రణలో పోలీసు శాఖ అద్భుతమైన ఫలితాలను సాధించిందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వార్షిక మీడియా సమావేశంలో ఆమె 2025 సంవత్సరపు పోలీసు ప్రగతి నివేదికను వెల్లడించారు. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత వల్లే పండుగలు, జాతరలు, పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని ఆమె కొనియాడారు. జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా సాంకేతికతకు పెద్దపీట వేశామని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా మొబైల్ రికవరీలో రికార్డు సృష్టించామని,సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ.2.16 కోట్ల విలువైన 1806 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామని తెలిపారు.నేరాల నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా 909 కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించామన్నారు. మహిళా రక్షణ కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రారంభించిన శివంగి దళం, పోలీస్ అక్కు, కార్యక్రమాలు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయని, వరదల సమయంలో ఈ బృందాలు ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించాయని గుర్తుచేశారు. నేరాల గణాంకాలను వివరిస్తూ.. 2025లో జిల్లాలో మొత్తం 4162 కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. ఇందులో 14 హత్య కేసులుఉండగా,517 ఆస్తి నేరాలకు గాను 149 కేసులను చేదించి సుమారు రూ.89 లక్షల విలువైన ఆస్తులను రికవరీ చేశామన్నారు. గంజాయి సాగును జిల్లాలో 99 శాతం నిర్మూలించామని, మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా పాఠశాలలు,కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించామన్నారు. పశువుల అక్రమ రవాణా ముఠాలపై,కోటిన్నర విలువైన ఆన్లైన్ బెట్టింగ్ వ్యాపారంపై ఉక్కుపాదం మోపి నిందితులను కఠినంగా శిక్షించామని వెల్లడించారు. ముఖ్యంగా భైంసా పట్టణ ప్రజల సౌకర్యార్థం ప్రతి బుధవారం అక్కడ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించామన్నారు. వరదల సమయంలో పశువుల కాపరిని రక్షించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసులు చూపిన చొరవ అభినందనీయమన్నారు. డయల్ 100 ద్వారా అందిన 22,327 కాల్స్‌కు సగటున 5 నిమిషాల్లోనే స్పందించి సహాయం అందించామని పేర్కొన్నారు. 2026 సంవత్సరంలో కూడా ప్రజలకు మరింత పారదర్శకమైన,జవాబుదారితనంతో కూడిన సేవలు అందిస్తామని తెలుపుతూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



గొల్లపల్లి ఎస్సై
ఎం.కృష్ణసాగర్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సర సంబరాలు ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా సంతోషాల నడుమ జరుపుకోవాలని గొల్లపల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేడు డిసెంబర్ 31 చివరి రోజు కావడంతో మండలంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నూతన సంవత్సర ఉత్సాహంతో మద్యం సేవించి వాహనాలు నడిపిన ,మైనర్లు వాహనాలు నడిపిన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ వేడుకలను ప్రజలు యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోష కరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ప్రజలకు సూచించారు. 2026 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని మండల ప్రజలకు పోలీస్ శాఖ తరఫున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజా రవాణా సౌకర్యానికి ఆటంకం కలగొద్దు

సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని ప్రజా రవాణా సౌకర్యానికి ఎట్టి పరిస్థితుల్లో ఆటంకం కలుగకూడదని సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి అన్నారు .మంగళవారం ఉప సర్పంచ్ గురిజల బుచ్చిరెడ్డి ,ఆర్ అండ్ బి ఏఈతో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ దావఖాన దగ్గర ,అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద ,వేణుగుమట్ల రోడ్డు దగ్గర ,నల్లగుట్ట దగ్గర దెబ్బ తిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మత్తులు ,చేపట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా చేయాలని ఆర్ అండ్ బి ఏఈని కోరగా వెంటనే ,ఏఈ స్పందిస్తూ వీలైనంత తొందరలోనే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి ,ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# మాతా శిశు ఆసుపత్రిలో సేవలు ఎప్పుడు..?

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో తాను మంత్రిగా వుండి కోట్లాది రూపాయలతో నిర్మింపజేసిన మాతాశిశు ఆసుపత్రిలో సేవలు ఎప్పుడు అందిస్తారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. పట్టణంలోని మాతాశిశు హాస్పిటల్ ని మంగళవారం మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణం పూర్తయి రెండేళ్ళైన ప్రజలకు సేవలు అందించకపోవడంపై ఈశ్వర్ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లా కేంద్రంలో ఉండాల్సిన మాతా శిశు ఆసుపత్రిని మంత్రిగా ఉన్న తాను నాటి సీఎం కేసీఆర్ ను ఒప్పించి రూ.8.5 కోట్లతో 50 పడకల హాస్పిటల్ భవనాన్ని పూర్తిచేసామని చెప్పారు. ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించి సేవలు ప్రారంభిస్తే నియోజకవర్గ మహిళలకు ఎంతో ఉపయోగపడేదని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మంత్రిగానున్న లక్ష్మణ్ కుమార్ గడిచిన రెండేళ్లుగా ఈ ఆసుపత్రిని సందర్శించకపోవడం, కనీస శ్రద్ధ చూపకపోవడంతో నిరుపయోగంగా వుందని ఈశ్వర్ పేర్కొన్నారు. వెంటనే అన్ని సౌకర్యాలు కల్పించి ఆసుపత్రిలో సేవలను ప్రారంభించాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి సత్తెమ్మ, ఇందారపు రామయ్య, బందారి రంజిత్, వొద్నాల మల్లేశం, శ్యాం, స్తంభంకాడి మహేష్, ఆసిఫ్, విజయలక్ష్మి, ఎల్లాగౌడ్, మొలాంగూరి రాజన్న పాల్గొన్నారు.

# శ్రీదేవి భూదేవి- సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో అతి పురాతనమైన స్వయంభు వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పవన్ శర్మ, కిషన్ శర్మ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని వైభవోపేతంగా జరిపారు. అంతకుముందు గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అతి పురాతనమైన స్వయంభు వెంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి చిన్న రాజన్న, వైస్ చైర్మన్ గుజ్జల శ్రీనివాస్, గంగా మాత ఆలయ కమిటీ చైర్మన్ నామపల్లి రాజ్ కుమార్, కమిటీ సభ్యులు, గంగా మాత ఆలయం పాలకవర్గం సభ్యులు గాజీ రాజన్న, నల్మెల రాజన్న, కల్లెడ శ్రీనివాస్, నల్లపు బుచ్చన్న, దాసరి గంగ నరసయ్య, గన్నారపువంశీ, వెలిగేటి అనిల్, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దేశంలో 10 కోట్ల మంది ప్రీ డయాబెటిక్ బాధితులు

బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ శిబిరాలు




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** మన దేశంలో 10 కోట్ల మంది ప్రీ డయాబెటిక్ బాధితులు ఉన్నారని బిఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.ఎన్.రావు తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా డయాబెటిక్ హైపర్ టెన్షన్ల బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారని అన్నారు. మనదేశంలో పది కోట్ల జనాభా డయాబెటిక్‌తో బాధపడుతున్నారని తెలిపారు. ప్రీ డయాబెటిక్స్ వల్ల 60 శాతం పేషెంట్లను డయాబెటిక్ బారిన పడకుండా చూడవచ్చన్నారు. బిపి,షుగర్‌ల వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం వల్ల బిపి షుగర్ వంటి నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ బారిన పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధులను మందుస్తుగా గుర్తించి నివారణలో భాగంగా డా.బిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బోయినిపల్లి, మానకొండూర్, కొత్తపల్లి మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోనూ ఈ నిర్ధారణ శిబిరాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లాశాఖతో పాటు కరీంనగర్ తానా సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షులు డా.ఆకుల శైల, కార్యదర్శి డా.మహేష్, కోశాధికారి డా.నీలిమ, ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డా.సంజయ్ కల్పండే, తానా అధ్యక్షుడు డా.ఎనమల్ల నరేష్, డా.డిసి తిరుపతిరావు, డా.విజయ మోహన్‌రెడ్డి, డా.సాయిని నరేందర్, డా.పలాస రామ్‌చరణ్, డా.యూనీస్, డా.తిరునాధర్, డా.బందారి రాజ్‌కుమార్ తదితరులున్నారు.

# ఐదుగురు కంటే ఎక్కువమంది గుమికూడటంపై నిషేధం



**ప్రజాపక్షం/కరీంనగర్ :** నూతన సంవత్సర (2026) వేడుకల సందర్భంగా నగరంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, కీలక ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం కమిషనరేట్ వ్యాప్తంగా ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో గుమికూడటాన్ని నిషేధించారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

నూతన సంవత్సర వేడుకల (2025–2026) నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు మరియు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ మేరకు కమిషనరేట్‌లోని అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 31 రాత్రి 8:00 గంటల నుండి జనవరి 1 తెల్లవారుజాము వరకు నగరం, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పెట్రోలింగ్, పికెట్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయబడ్డాయి. సమస్యాత్మక, రద్దీ ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు బ్రీత్ అనలైజర్లతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తారు. తాగి వాహనం నడిపితే వాహనం సీజ్ చేయడంతో పాటు, డ్రైవర్‌ను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించి కఠిన చర్యలు తీసుకుంటారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని సీపీ కోరారు.



# వికలాంగులకు ఉచితంగా వివాహాలు

అమ్మ మ్యాట్రిమోనీ వ్యవస్థాపక ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బిఎం అర్జున్ రావు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో అమ్మ అసోసియేషన్ రెండో ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్యాట్రిమోనీ వ్యవస్థాపక, ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బిఎం అర్జున్‌రావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా అసోసియేషన్ పలు కీలక తీర్మాణాలు చేసింది. ఉమ్మడి జిల్లాల్లో మ్యాట్రిమోనీ కార్యాలయాల ఏర్పాటు, ఆపదలో ఉన్నవారికి సంఘం ద్వారా వడ్డీలేని రుణాలు అందించడం, వికలాంగులకు ఉచితంగా వివాహాలు జరిపించడం, సభ్యులు ఎవరైనా హఠాన్మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అమ్మ అసోసియేషన్ ద్వారా కుదుర్చిన వివాహాలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మ్యాట్రిమోనీ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుమల మల్లేశం, కొక్కుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి జయరాజు, శ్యామ్, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, హైదరాబాద్ ప్రతినిధులు రమ్య, కవిత, సాయి లక్ష్మి , మమత, రవి, మనోహార్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా శ్రీనివాస్

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఇటీవలే గ్రామాలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి ఫోరం మండల అధ్యక్షుడిగా రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఫోరం అధ్యక్షునిగా తోట శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా ఓబులాపూర్ తండా సర్పంచ్ లకవత్ కాంతి జవహర్లాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, కుస్తాపూర్ సర్పంచ్ జెల్ల రాజు, ఓబులాపూర్ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి, హుస్సేన్ నగర్ సర్పంచ్ సాయి దాబి సయ్యద్ ,హైదర్ ,తదితరులు ఉన్నారు.

**ఫోరం అధ్యక్షుడి ఎన్నికకు నా మద్దతు లేదు**

కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడి ఎన్నికలో తన మద్దతు లేకుండానే అధ్యక్షున్ని ఎన్నుకున్నారని రత్నాపూర్ సర్పంచ్ గొండ రాజేందర్ ఆరోపించారు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి ఫోరం అధ్యక్షుడుపై చర్చించారని, సమావేశం అనంతరం బయటకు వెళ్లిపోయాక తనకు తెలియకుండానే తన మద్దతు లేకుండానే ఫోరం అధ్యక్షున్ని ఉపాధ్యక్షుని ప్రకటించడం సమంజసం కాదని ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచానని కానీ ఇలా తనకు తెలియకుండానే ఫోరం ఎన్నికను నియమించుకోవడం తనను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

# పులి సంచారంపై కేంద్రమంత్రి ఆరా

కరీంనగర్ డీఎఫ్ఓకు ఫోన్

పులి సంచారం నిజమేనని చెప్పిన డీఎఫ్ఓ

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచరించిన తీరుపై కేంద్ర శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణితో ఫోన్ లో మాట్లాడి రైతులు, స్థానికులు భయపడకుండా ఉండేందుకు అవసరమైన చర్యల్ని చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. అయితే అక్కడి ప్రాంతంలోకి వెళ్లిన అటవీశాఖ అధికారులు పులి కాలి ముద్రలు ఉన్నట్లు ధ్రువీకరించారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి ఇది ఇక్కడికి వచ్చిందని, మగ పులిగా భావిస్తున్నామని అధికారులు తెలిపారు. అయితే కరీంనగర్ జిల్లాలో ఎక్కువగా అటవీ ప్రాంతం లేకపోవడంతో అది పెద్దపల్లి జిల్లాకు వెళ్ళి ఉంటుందనే అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేశారు. పులి సంచారం విషయమై స్థానిక ప్రజలు, రైతుల్లో కొందరు సంఘటన విషయాన్ని మంత్రి దృష్టికి తేవడంతో ముందుగా కొందరితోనూ కేంద్ర మంత్రి ఫోన్ లో మాట్లాడి అధైర్య పడొద్దని చెప్పారు.

# మున్సిపల్ కార్మికుల శ్రమను దోచుకుంటారా?

### జీవో 60 అమలు చేసే వరకు

### సమ్మె విరమించేది లేదు..!

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** బైంసా పట్టణ మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం చేపట్టిన పోరాటం ఉద్ధృతమైంది.తమకు రావాల్సిన వేతనాలను అక్రమంగా తొక్కిపెడుతూ,అధికారులు పచ్చిగా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గత 11 రోజులుగా బైంసాలో సాగుతున్న ఆందోళన మంగళవారం నాటికి జిల్లా కేంద్రానికి పాకింది.సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి,నిర్మల్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి తమ గోడును విన్నవించి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మేన సురేష్ మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా 2023 నుంచే జీవో 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు 30 శాతం వేతన పెంపు అమలవుతున్నా,బైంసా మున్సిపాలిటీలో మాత్రం దీనిని తుంగలో తొక్కారని విమర్శించారు.దీనివల్ల ప్రతి కార్మికుడి నుంచి నెలకు సుమారు 6,100 రూపాయల చొప్పున వేతన దోపిడీ జరుగుతోందని ఆయన ఆరోపించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చెత్త తొలగింపు వంటి కీలక పనులు చేస్తున్న కార్మికుల పట్ల బైంసా మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని నాయకులు ధ్వజమెత్తారు.కార్మికుల బాగోగులు చూడాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉన్నా,తొమ్మిది రోజులుగా ఆందోళన జరుగుతున్నా స్పందించకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా స్కిల్డ్,అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం 19,500 రూపాయలు వెంటనే చెల్లించాలని,2023 నుం చి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వేతనాల సమస్యతో పాటు,2011 నుండి పీఎఫ్ నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేయకపోవడంపై కూడా వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.వారాంతపు సెలవులు,పండుగ సెలవులు కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయుంచుకుంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. కార్మికుల ఆవేదనను విన్న జిల్లా కలెక్టర్ స్పందిస్తూ,జనవరి నెల నుండి పెంచిన వేతనా



లను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, కేవలం మాటలతో సరిపెట్టకుండా,జీవో 60 అమలుపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలయ్యే వరకు తమ సమ్మెను విరమించే ప్రసక్తే లేదని కార్మికులు తెగేసి చెప్పారు.అధికారులు తమ వైఖరి మార్చుకొని కార్మిక చట్టాలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ ఆరీఫ్,ఉపాధ్యక్షుడు కదం బాబు,సైద్ కద్దుస్, వికాస్ ,ప్రధాన కార్యదర్శి గదేవాడ్‌సహాయ కార్యదర్శులు నగేష్,గంగా,సావిత్రి,విజయలక్ష్మి ,సౌత్రబా య్,కోశాధికారి సలీం,ఇతర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## మంజీరా నుండి అక్రమంగా ఇసుక తరలింపు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలో అక్రమ ఇసుక రవాణాలు నిత్యం రాత్రి వేళల్లో కొనసాగుతున్నాయి. తాజాగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో గల మాంజీరా నదిలో నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు పొందకుండా సోమవారం రాత్రి నాలుగు ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. సమాచారం మేరకు రాత్రివేళ కాపుకాసి ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలకు నిరసనగా బంగ్లాదేశ్ ప్రభుత్వ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను విశ్వ హిందుపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకోవాలని లేని యెడల భారత ప్రభుత్వం భారత సైన్యం ఊరుకునేది లేదన్నారు. రాజకీయ నాయకులు వ్యక్తిగత స్వార్థం క ఒరకు హిందువులపై జరుగుతున్న అరాచకాలను, మారణ హోమాలను చూస్తూ నోరు మెదపకుండా ఉన్నారని, నాడు జై పాలస్తీనా అన్న నాయకులు ఎటు పోయారని ప రశ్నించారు. ఈ సెక్యులర్ రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పే రోజు ముందుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్దళ్, వీహెచ్‌పీ జిల్లా త్రి కండ సంఘటన మంత్రి వినోద్‌కుమార్, జిల్లా గోరక్ష ప్రముఖ్ తులసీదాస్, మహ్మద్‌నగర్ మండల వీహెచ్‌ఓ మనోజ్‌కుమార్, మోహన్, సంతోష్, యోగేష్, అభి, పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/ముధోల్ :** గ్రామంలోని నెలకొన్న సమస్యలను పరిష్కరానికి కృషి చేస్తానని విట్టొలి సర్పంచ్ కాలేవార్ రుచితదిగంబర్ అన్నారు.మంగళవారం ముధోల్ మండలంలోని విట్టొలి గ్రామంలో సర్పంచ్ పలు కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రధానంగా విధి దీపాలు లేని చోట గుర్తించి విద్యుత్ స్తంభాలపై నూతన ఎల్ఈడి బల్బులు(వీధి దీపాల)ను అమర్చారు.అదేవిధంగా గ్రామస్తులకు ఎలాంటి సమస్య లేకుండా చూస్తానని అన్నారు.అంధకారంగా ఉన్న గ్రామం ఇప్పుడు విద్యుత్ దీపాలు అమర్చడంతో కళకళలాడబోతుంది.ఇందుకుగాను నూతన సర్పంచ్‌కి గ్రామస్తులు,ఆయా కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

## సొంత ఖర్చులతో చెత్త బండి ఏర్పాటు

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మున్సిపాలిటీ కార్మికులు గత 12 రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్న సందర్భంగా గల్లీలలో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకపోవడంతో సొంత ఖర్చులతో చెత్త బండి ని ఏర్పాటు చేయడం జరిగింది.గల్లీ ప్రజల సమస్యను తీర్చడం జరిగింది.ఆశ ఉన్న వాడికి అధికారం ఇస్తే దోచుకుంటాడు మాలాంటి ఆశయం ఉన్నవారికి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారు బిజెపి పట్టణ అధ్యక్షుడు రావుల రాము అన్నారు.

## పరామర్శించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/బైంసా :** ముధోల్ మాజీ శాసన సభ్యులు జీ విట్టల్ రెడ్డి కూతురు శ్రీమతి సులోచన అనారోగ్యాకారణాలవల్ల మూడు రోజుల క్రితం స్వర్గస్తులైనారు విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ రోజు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.కలెక్టర్ వెంట బైంసా

# దేవరకోట శ్రీవారి సన్నిధిలో బిజెపి రాష్ట్ర నాయకులు రావుల రామ్‌నథ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన దేవరకోట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రావు రామ్నాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు.పవిత్రమైన ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్న ఆయన ,ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రావుల రామ్నాథ్ మాట్లాడుతూ..ఏడాదికి ఒకసారి వచ్చే వైకుంఠ ఏకాదశి నాడు దేవరకోట వేంకటేశ్వరుని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకోవడం పరమ పవిత్రంగా భావిస్తున్నట్లు తెలిపారు.స్వామివారి కృపాకటాక్షాలతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తాను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి కావడంతో ఆలయం మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోందని,భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కుటుంబ సభ్యులు,ఆలయ అర్చకులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### మోహన్‌రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావ్ పటేల్

**ప్రజాపక్షం/తానూర్:** పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్,అన్నారు.మండల కేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కస్తూర్బా గాంధీ,ఆశ్రమ పాఠశాల,తో పాటు మండలంలోని కోలుర్,ఎల్వి,బొరిగాం,బోసి,గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు,మంగళవారం స్థానిక నాయకుల తో కలిసి స్టడీ మెటీరియల్(ఆల్ ఇన్ వన్) అయన అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని,ఉపాధ్యాయులు నేర్పించే పాఠాలను శ్రద్ధతో విని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు.విద్యార్థులు



కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కోలుర్ గ్రామ సర్పంచ్ బొడకే మాధవ్ రావ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయిబాబు,వెంకట్ రెడ్డి,అలేఖ్య రెడ్డి,మండలం నాయకులు రమేష్‌పటేల్,జ్ఞానేశ్వర్,ఉపాధ్యాయులు,ట్రస్ట్ టీం సభ్యులు,గ్రామస్తులు,పాల్నొన్నారు.

# గ్రామంలో నెలకొన్న సమస్యలు అభివృద్ధికి సహకరించండి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని లక్కంపూర్ పంచాయతీ పరిధిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి గ్రామ అభివృద్ధికి సహకరించాలని మంగళవారం సర్పంచ్ సెడ్మక సుజాత గంగాధర్,ఉపసర్పంచ్ రేంగే పూజా సిద్దేశ్వర్,లతో కలిసి మండల అభివృద్ధి అధికారి,తహసిల్దార్,సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఎన్నికైన సందర్భంగా గ్రామ సమస్యలను అధికారులకు విన్నవించడం జరిగిందని అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సునీల్ కుమార్,పెందుర్ నాగేశ్, శ్రీను,అంకుష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులకు సన్మానం..



మండల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌జాదవ్,ఇటీవల నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా అధికారులను శాలువాతో సన్మానించి పలు సమస్యలను విన్నవించారు.

## వెంకటేశ్వర ఆలయంలో డిసిసి చీఫ్ దంపతుల పూజలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలోని ఖండెబల్లూర్ గ్రామంలో గల పురాతన వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌శైలజ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కొరకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఖండెబల్లూర్ సర్పంచు, ఉపసర్పంచులతో పాటు నాయకులు డీసీసీ చీఫ్ దంపతులను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.

## ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలం బాగాపూర్ శివార్‌లో గల నారాయణ గుట్ట గా పిలువబడే లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్ష్మీ నారాయణ స్వామికి పంచామృతాలతో అభిషేకం గావించడం జరిగింది.సహస్ర తులసీదాళాలతో లక్ష్మీ నారాయణ స్వామికి తులసీదళార్చన గావించడం జరిగింది.పుష్పాలతో అష్టోత్తర పూజ గావించడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ వైష్ణవ అర్చకుడు నరసింహస్వామి మాట్లాడుతూ పుష్య మాసంలో వచ్చే శుక్ల ఏకాదశిని ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠంలో ఉత్తర ద్వారాలు తెరుచుకుంటాయని ఈ రోజు న దేవతలందరును ఉత్తర ద్వారం గుండా శ్రీమహావిష్ణువును దర్శించుకోవడం జరుగుతుంది కావున ఈ ఏకాదశి ని వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు.24 ఏకాదశిలలో ఈ ముక్కోటి ఏకాదశి ముఖ్యమైనది ఈ రోజున స్వామిని ఎవరైతే ఉత్తర ద్వారం గుండా దర్శిచుకున్న భక్తులందరికీ సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని సకల కార్యాలు నెరవేరుతాయని ఆలయ అర్చకుడు నరసింహస్వామి తెలియజేశాడు.బాగాపూర్,రాజుర లోకేశ్వరం, మన్మ ద్ పిప్రి గడ్చందా గ్రామాల భక్తులు లక్ష్మీ నారాయణ స్వామిని దర్శించుకోవడం జరిగింది.భక్తులు తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు.

# ఇంటర్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశం

### నిర్మల్ లో ఈ నెల 31న హెచ్‌సీఎల్ 'టెక్ బీ' మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇంటర్మీడియాట్ పూర్తి చేసిన,ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు ఒక అద్భుతమైన అవకాశం లభించింది ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ బుధవారం నాడు నిర్మల్ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ పరశురాం,హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధి రాజుల రాజేష్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.ఐటీ,డిపిఓ విభాగాల్లో సాఫ్ట్‌వేర్ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రత్యేక ఎంపిక ప్రక్రియను చేపడుతున్నారు.ఈ ఉద్యోగ మేళాకు కేవలం ఒక విభాగానికి చెందిన వారే కాకుండా ఎంపీసీ,సీఈసీ,బైపీసీ,హెచ్ఈసీ,వొకేషనల్ వంటి అన్ని గ్రూపుల విద్యార్థులు హాజరుకావచ్చు.2024,2025 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారితో పాటు,ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతూ 2026 లో ఉత్తీర్ణులు కాబోయే విద్యార్థులకు కూడా ఈ మేళాలో పాల్గొనే అరుదైన అవకాశంఒ కల్పించారు.ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల అభ్యర్థులు ఎవరైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.ఆసక్తి గల అభ్యర్థులు తమతో పాటు పదో తరగతి మార్కుల జాబితా నకలు,ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికేట్ లేదా ఆన్‌లైన్ మెమో,ఆధార్ కార్డు జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలి.నిర్మల్ బస్ డిపో ఎదురుగా,బిగ్‌సి పైన ఉన్న అమిత్(అమిత్ ఐసిఎస్ఎస్) కంప్యూటర్స్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులు ముందుగా నిర్ణీత ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మేళాకు సంబంధించిన మరింత సమాచారం,ఇతర వివరాల కోసం హెచ్‌సీఎల్ ఏరియా ప్రతినిధి రాజుల రాజేష్ కుమార్ ను 80740 65803 ,97 01 665 424 నంబర్లలో సంప్రదించవచ్చు, ఇంటర్ అర్హతతోనే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే నిరుద్యోగ యువత,విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని వదులుకోవద్దని కోరారు.

## వనదర్శిని కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** అటవీశాఖ ఆధ్వర్యంలో ఇటుకలపహాడ్ అటవీ ప్రాంతంలో నిర్వహించిన వనదర్శిని కార్యక్రమంలో సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని టిఎస్డబ్ల్యు ఆర్‌జెసి, ఎస్ఆర్, ఈడెన్ గార్డెన్స్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న వివిధ రకాల చెట్లు, వన్యప్రాణుల గురించి విద్యార్థులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడవిలో కనిపించిన పులి అడుగులను ఆసక్తిగా పరిశీలించారు. కనుమరుగవుతున్న జాతీయ జంతువు పులి ఆవాసాన్ని సంరక్షిస్తున్న అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో అడవులు, వన్యప్రాణుల ప్రాధాన్యతపై ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాల కోసం అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు మోహన్ రావు, తిరుపతి, అతరుద్దీన్, అక్తర్, తులసీదాస్ నాయక్, బీట్ ఆఫీసర్లు, వాచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్

**ప్రజాపక్షం / కౌటాల :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31న కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ఎస్పి నికిత పంత్ ఆదేశాల మేరకు, డిఎస్పి వహీదుద్దీన్ పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలతో ఈ తనిఖీలు చేపట్టనున్నారు. యువత మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్లపై అల్లర్లు చేయడం, ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక శబ్దంతో డిజేలు ఏర్పాటు చేయడం, పెద్ద సౌండ్ బాక్సులతో ఇబ్బంది కలిగించడం, రోడ్లపై కేక్ కటింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, కూడళ్ల వద్ద చలి మం టలు వేయడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలందరూ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.




## సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భోస్లే పండిత్ రావు ఎన్నిక

**ప్రజాపక్షం/బైంసా :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భోస్లే పండిత్ రావు పటేల్ ఎన్నుకున్నారు.ఈ సమావేశాన్ని హైదరాబాద్‌లో లక్డీకాపూల్‌లోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గానికి చెందిన ప్రజానాయకుడిగా,ప్రజల సమస్యలపైన ఎప్పుడు ముందుండే నాయకుడిగా భోస్లే పండిత్ రావు పటేల్‌కు మంచి పేరు ఉంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సమయంలో కూడా ఆయన చురుకుగా పనిచేసి,ముధోల్ నియోజకవర్గంలో ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి,పంచాయతీ బలోపేతం,సర్పంచ్‌లకు న్యాయం చేయడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తానని తెలిపారు.గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సంఘం మధ్య సమన్వయం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు,ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.ఈ ఎన్నికతో రాష్ట్రంలోని సర్పంచ్‌లకు మరింత బలమైన స్వరంగా పనిచేస్తారని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.పండిత్ రావు పటేల్‌కు ఇదివరకే బైంసా మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న విషయం తెలిసిందే.



## దేవరకోట శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో మాజీ మంత్రి అల్లోల

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన దేవరకోట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.మంగళవారం తెల్లవారుజామునే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,తన సతీమణి అల్లోల విజయలక్ష్మి తో కలిసి స్వామివారిని సందర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న అల్లోల దంపతులకు అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం వారు స్వామివారిని వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పవిత్రమైన ముక్కోటి ఏకాదశి నాడు స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని,రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని ఆ వెంకటేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు.వైకుంఠ ఏకాదశి కావడంతో దేవరకోట ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.భక్తుల గోవింద నామస్మరణంతో ఆలయ పరిసరాలు మారుమోగాయి,ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్,ఈవో,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



## వివేకానంద పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలం కలమడుగులోని వివేకానంద పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడానికి పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమం చేపట్టింది. పాఠశాల ప్రాంగణం రంగురంగుల వంటకాలు, నోరూరించే సువాసనలతో సందడిగా మారింది. ప్రాథమిక తరగతి నుంచి ఉన్నత తరగతి విద్యార్థుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ఇళ్ల నుంచి రకరకాల సంప్రదాయ, ఆధునిక వంటకాలను స్వయంగా తయారు చేసుకుని వచ్చి ప్రదర్శించారు. పులిహోర, చక్ర పొంగలి, గారెలు వంటి పిండివంటలతో పాటు చిరుధాన్యాలతో చేసిన రాగి ముద్దలు, జొన్న రొట్టెలు, మొలకెత్తిన విత్తనాలు, ఫ్రూట్ సలాడ్స్ సిద్ధం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు సతీష్ గౌడ్, విద్యావేత్త శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వంట చేయడం ఒక కళ అని తెలిపారు. ఇది విద్యార్థుల్లో క్రమశిక్షణ, టీమ్ వర్క్ పెంపొందిస్తుందని చెప్పారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై వంటకాలను రుచి చూసి పిల్లలను అభినందించారు. విద్యార్థులు తాము తయారు చేసిన వంటకాలలోని పోషక విలువల గురించి వివరించారు.

## పారిశుద్ధ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి

**ప్రజాపక్షం / కాసిపేట :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పాలకవర్గాల పాత్ర చాలా కీలకమని ఎంపిడిఒ సత్యనారాయణ సింగ్, ఎంపిఒ సఫ్దర్ అలీ పేర్కొన్నారు. కాసిపేట ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం 22 గ్రామ పంచాయతీల కొత్త సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. కార్యదర్శులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారని, వారికి సహకరించి అభివృద్ధి పనులకు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. అధికారుల నుంచి ఎల్లవేళలా సహకారం ఉంటుందని, సర్పంచులు కూడా అధికారులకు సహకారం అందించాలని కోరారు. పై అధికారుల ఆదేశాలను అనుసరించి ముందుకు వెళ్లాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, అనంతరం అన్ని పార్టీల నాయకులు గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.

## న్యూ ఇయర్ పేరిట యువత ఆగం కావద్దు: టి.జి.వి.పి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** న్యూ ఇయర్ వేడుకల్లో పేరిట యువత జరుపుకోవడం మన సంస్కృతి సాంప్రదాయం ప్రకారం ఉగాది తెలుగు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సరమని మంగళవారం నిర్మల్ పట్టణ కేంద్రం లో గాంధీ పార్క్ ఎదుట రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ పేరిట వృధా ఖర్చు చేస్తున్నారన్నారు.కేకులు కట్ చేస్తూ కూల్ డ్రింక్స్ మన సాంప్రదాయానికి విరుద్ధంగా నడుచుకుంటున్నారన్నారు.మంగళవారం సమావేశంలో మనకు ఉగాది ముద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో కరణ్ రాథోడ్,పవర్ ఆత్మారాం పవర్ నితిన్,ఆడే మిథున్ అర్జున్ జాదవ్,ఆవిష తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పరిశీలించిన సర్పంచ్ లలిత భోజన్న

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామంలోని పారిశుద్ధ్యం,డ్రైయిన్లు నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లలిత భోజన్న మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను త్వర త్వరగాపూర్తి చేసుకోవాలని నాణ్యత ప్రమాణాలతో కట్టుకోవాలని మరిన్ని సూచనలు లబ్ధిదారులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ముధోల్ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బైంసా :** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ రోజు తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్,..ఈ సందర్భంగా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలకు సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని,ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.వారితో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్,సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్,సీనియర్ నాయకులు అశోక్ ముస్తాఫిరె,నాయకులు పాల్గొన్నారు.

## నేతాజీ పబ్లిక్ స్కూల్లో మాక్ పోలింగ్

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా కొట్ల బి గ్రామంలోని ప్రైవేట్ నేతాజీ పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మాక్ పోలింగ్ పిల్లలను ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమంలో విద్యార్థులే అభ్యర్థులుగా,పోలింగ్ అధికారులు,సిబ్బంది పాత్రల్లో పాల్గొని ఎన్నికల విధానాన్ని అనుభవించేలా చేశారు.బ్యాలెట్ బాక్సు,గుర్తింపు ప్రాసెస్,ఓటింగ్ గదులు,మొదలైన వాటిని ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట గంగాధర్,ఉపాధ్యాపయులు ప్రకాష్,కృపా రాణి, మంగమ్మ, వనిత,సుమప్రియ,పూజా,సుమత,సోనీ,సంధ్య,పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడలు అవసరం

**ప్రజాపక్షం / రెబ్బెన :** విద్యార్థులకు చిన్ననాటి నుంచి విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలు ఎంతో అవసరమని రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం రెబ్బెనలోని ఎస్‌వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని తెలిపారు.ఇంజనీర్లు, పోలీస్ శాఖలో ఉద్యోగులుగా స్థిరపడటం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ దుర్గం భరద్వాజ్ మాట్లాడుతూ ఎస్‌వి పాఠశాల గత 28 ఏళ్లుగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తోందని కొనియాడారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు పేరు తేవాలని కోరారు. వరంగల్‌లో జరిగిన కరాటే పోటీల్లో కటాస్, ఫైటింగ్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల యాజమాన్యం తరఫున నూతనంగా ఎన్నికైన సర్పంచ్ దుర్గం భరద్వాజ్, ఎస్ఐ వెంకటకృష్ణను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దీకొండ విజయ్ కుమారి, ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు రాజేశం, మంజు, నర్మదా, నవ్య, లిల్లికుట్టి, మేఘన, మహేష్ పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్‌లో కంపెనీ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియా శాంతి మైదానంలో వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ఒలింపిక్ పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు విధులను నిర్వహిస్తూనే క్రీడల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, తద్వారా సంస్థకు ఆరోగ్యవంతమైన పని వాతావరణం లభిస్తుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా త్రోబాల్, రన్నింగ్, త్రోస్, లాంగ్ జంప్ పోటీలు, పురుషులకు రన్నింగ్, లాంగ్ జంప్, త్రోస్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించి సంస్థకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాభివృద్ధి కోసం గ్రౌండ్లు, స్టేడియంలు, సిఈఆర్ క్లబ్బు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాలను యాజమాన్యం కల్పిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, డిజిఎం (పర్సనల్) చీఫ్ కోఆర్డినేటర్ ఎస్ అనిల్ కుమార్, ఆర్కె 5



గని ఏజెంట్ శ్రీధర్, డిప్యూటీ సిఎంఒ డాక్టర్ రమేష్ బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, జాన్ వెస్లీ, పర్వా శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రమేష్, కోఆర్డినేటర్ నరసయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఇండోర్ కెప్టెన్ సురేష్, ఏరియాల కోఆర్డినేటర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామానికి చెందిన రాందేని మల్లేష్ (57) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన ఇంటి నుంచి కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆంధ్ర బోర్ మహీంద్రా షోరూం ఎదురుగా ఈ సంఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ చౌరస్తా నుంచి ఊట్కూర్ వైపు అతివేగంగా వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మల్లేష్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంచిర్యాలలోని మెడిలైవ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో రాత్రి 9:30 గంటలకు మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తిని యుగేందర్ గా గుర్తించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య రాందేని సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు.

## కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపాలిటీ విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు నాయకులు మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రవాణా చేస్తున్న పెద్ద కంటైనర్‌తో రోడ్లు అధ్వాన్నంగా తయారవుతున్న దానిపై రాబోయే వేసవి కాలంలో కప్పలవాగు నుంచి పెద్ద మొత్తంలో ఇసుక తీస్తే చుట్టుపక్కల రైతులకు సాగునీరందక ఇబ్బంది పడుతారని పట్టుకున్న 6 కంటైనర్లు ఎవరివి ఎవరు ఈ ఇసుక మాఫియా నడుపుతున్న వారిపై ఎలాంటి కేసులు వేసినారు వివరాలు అన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, బాలభగత్, నర్సయ్య, ప్రసాద్, సతీష్‌గౌడ్, అశోక్, సునీల్, రథన్, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

## సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ఎస్ అండ్ పిసి ఉద్యోగుల పాత్ర కీలకం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి వ్యాప్తంగా సంస్థ ఆస్తుల పరిరక్షణలో ఎస్ అండ్ పిసి ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని బిఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రక్షణ సిబ్బందికి యాజమాన్యం సరైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా రక్షణ సిబ్బందికి, ఓసి ఆవరణ సెక్యూరిటీ పోస్టులలో తగిన రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎండ, వాన, చలి నుంచి రక్షణగా వారికి అనువైన షెల్టర్ రూములు నిర్మించాల్సిన బాధ్యత ఆయా డిపార్ట్మెంట్లపై ఉందని తెలిపారు. ప్రస్తుతం శ్రీరాంపూర్ ఏరియాలో పులుల సంచారం ఎక్కువగా ఉన్నందున భద్రత కొరకు సరైన చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ సాండ్ బంకర్, రామారావు పేట, ఓపెన్ కాస్ట్ బోర్వెల్ పాయింట్ వద్ద వెంటనే చెక్ పోస్టుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పిఎంకెవిఎస్‌బిఎంఎస్ తరఫున శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సెక్రెటరీ రాగం రాజేందర్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ జల్లా తిరుపతి, పిట్ సెక్రెటరీ నాగార్జున నాయక్, కొమ్ము బాపు, చొప్పరి శ్రీకాంత్, కాంట్రాక్ట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నీరటి సురేష్ పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు

**ప్రజాపక్షం / జన్నారం :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జన్నారం మండలం కలమడుగు గ్రామంలోని బ్యాంకు శాఖలో ఈ కార్యక్రమం జరిగింది. బ్యాంకు మేనేజర్ కుమారస్వామి మాట్లాడుతూ ఖాతాదారులకు సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్, బ్యాంకు ద్వారా కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. నూతన సంవత్సరం సందర్భంగా వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటిపిలు ఎవరితో షేర్ చేసుకోవద్దని హెచ్చరించారు. రైతులకు, ఖాతాదారులకు, వ్యాపారస్తులకు బ్యాంకు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ బొంతల నాగమణి, గౌరవ అధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి వినోద్, బ్యాంక్ క్యాషియర్ మహేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

### బంజారా సేవా సంఘ్ జిల్లా ఉపాధ్యక్షునిగా తుక్కాజీనాయక్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** జిల్లా బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గంలో భీమ్‌గల్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మండలంలోని కారేపల్లికి చెందిన ప్రముఖ నాయకులు రామవత్ తుక్కాజీనాయక్‌ని జిల్లా బంజారా సేవా సంఘ్ ఉపాధ్యక్షునిగా నియమిస్తూ జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నియామకంపై జిల్లా బంజారా సేవా సంఘ్ అధ్యక్షులు చంద్రునాయక్, బాబురావునాయక్ మాట్లాడుతూ తుక్కాజీనాయక్ సేవలు జిల్లావ్యాప్తంగా ఉన్న బంజారా బిడ్డలకు అండగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బంజారా నాయకులు పాల్గొని తుక్కాజీనాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం / తిర్యాణి :** నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తిర్యాణి ఎస్ఐ సెగ్యం వెంకటేష్ సూచించారు. తిర్యాణి పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తోందని తెలిపారు. యువత ఉత్సాహం పేరుతో చేసే విన్యాసాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. సాయంత్రం నుంచే ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద నిరంతర డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే వాహనాలను జప్తు చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. డిజే సౌండ్ సిస్టమ్స్ కు అనుమతి లేదని, అధిక శబ్దాలతో ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. బైక్లపై రేసింగ్లు చేయడం, సైలెన్సర్లు తొలగించి అతి వేగంగా ప్రయాణించడం వంటివి చేస్తే వాహనాలు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ కాంట్రాక్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పొలం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా గంధారి చంద్ర మోహన్, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా మొల్ల రాములు, ప్రచార కార్యదర్శిగా ఎర్రబెల్లి రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పొలం సత్యనారాయణ, గంధారి చంద్ర మోహన్, అనిల్ కుమార్, మొల్ల రాములు, ఎర్రబెల్లి రాజేష్ పాల్గొన్నారు.

## మురికి కాలువలు శుభ్రం చేయించిన సర్పంచ్

**ప్రజాపక్షం / నందిపేట్ :** కొత్తగా ఎన్నికైన సర్పంచ్ సిలిండర్ లింగం గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయించడం, రోడ్లు శుభ్రం చేయించడం మొదలుపెట్టారు. మంగళవారం మొదటి వార్డులో సిబ్బందితో మురికి కాలువల శుభ్రం చేయించి వార్డు ప్రజల మన్ననలు పొందారు. గ్రామంలో అన్ని వార్డులలో పనులు చేయిస్తానని సర్పంచ్ అన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయవద్దు

**ప్రజాపక్షం / దండేపల్లి :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలని మంచిర్యాల జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఉపాధి కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం డిఆర్‌డిఓ కిషన్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆర్టీపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గాయపడిన విద్యార్థులను పరామర్శించిన బిజెపి నాయకులు

**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేటలో జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బిజెపి నాయకులు పరామర్శించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ ఎర్రబెల్లి సూచన మేరకు జోన్ అధ్యక్షుడు అమీర్ శెట్టి రాజు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హాజీపూర్ మండల అధ్యక్షుడు గడ్డం స్వామి రెడ్డి, జోనల్ జనరల్ సెక్రెటరీలు బింగి సత్యనారాయణ, చిరంజీవి, బిజెపి నాయకులు విష్ణు, సాయి, మణికంఠ పాల్గొన్నారు.

## ఎరుకల కుల బలోపేతానికి ఏకం కావాలి

### జిల్లా అధ్యక్షుడు ఉండ్రాల ఎల్లయ్య

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎరుకల కులస్తులందరూ కుల బలోపేతానికి ఏకం కావాలని జిల్లా అధ్యక్షులు ఉండ్రాల ఎల్లయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కేమసారం తిరుపతి ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ లో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడి పిలుపుమేరకు మంచిర్యాల జిల్లాలో ఎరుకల సమస్యలపై నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జగన్నాధుల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాధుల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉండ్రాల రవి, కోశాధికారి దుగ్యాల సంతోష్, అశోక్, చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు దుగ్యాల రవికుమార్, నెన్నల మండల అధ్యక్షులు ఉండ్రాల రాకేష్, మొగిలి శేఖర్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన రాచకొండ పోషన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఎంఎల్‌సి దండే విఠల్ ఆదేశాల మేరకు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోషన్న కుటుంబానికి ఎంఎల్‌సి దండే విఠల్ అండగా ఉంటారని భరోసా కల్పించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్, హనుమ గౌడ్, సంతోష్, అతబేగ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలను సాధించటానికి ఉపయోగపడేది గణిత శాస్త్రమే

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జీవితంలో సమస్య పరిష్కార నైపుణ్యాలను ఖచ్చితంగా సాధించటానికి ఉపయోగపడేది గణిత శాస్త్రమేనని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో భారత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 225 మంది విద్యార్థులకు జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీల కార్యక్రమం నిర్వహించినట్లు టిఎంఎఫ్ అధ్యక్షులు కృష్ణ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. జయసాగర్, దామోదర్, సురేష్ పాల్గొన్నారు.

## నందిపేట్ రామాలయంలో వైకుంఠ ఏకాదశి దర్శనాలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం పర్వదినం సందర్భంగా భక్తులు ఉదయం నుంచే దర్శనాలకు బారులు తీరారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు కేదార స్వామి పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ విగ్రహాల అభిషేకం చేశారు.

## వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులు పరికరాల కోసం సంబంధిత మండల వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ ఇన్చార్జి అధికారి రామకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పురుష రైతులకు 40 శాతం, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి కొయ్యాలను కాల్చవద్దని, పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు.రబీ సీజన్ కు కావలసిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి డీలర్లను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ యూరియా యాప్ పైన పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఒ గౌసియా, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

## సర్పంచ్ వార్డు మెంబర్‌లకు ఘణ సన్మానం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన చిట్యాల లక్ష్మ ణ్ , ఎనిమిదవ వార్డు మెంబర్ గా ఎన్నికైన ముష్కరి రమేష్ లను వంజరి పెద్ద సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి తమను ఎన్నుకున్న గ్రామ ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటూ సేవ చేస్తామని సందర్భంగా సర్పంచు లక్ష్మ ణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వంజరి పెద్ద సంఘం అధ్యక్షుడు ముష్కరి కిషన్, మండల అధ్యక్షుడు లవంగ శ్రీను, సభ్యులు సురేందర్ రాజ్ కుమార్, ఇస్తారి, లవంగ గంగాధర్, తుకారాం, లింగం, రాజారెడ్డి రాకేష్ రాజేష్ తదితరులున్నారు.

## మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా దార సురేష్

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా దార సురేష్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని 18 మంది సర్పంచులు ఉండగా పది మంది సర్పంచులు దార సురేష్‌కు మద్దతు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా మర్రి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోడేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అశోక్, రేణికుంట్ల శ్యామల, కోశాధికారిగా చింతం శ్రీలత, సభ్యులుగా రమణారెడ్డి, సంపత్, మాధవి, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

## కోనేరులో ముక్కోటి ఏకాదశి భక్తుల సందడి



**ప్రజాపక్షం/ముత్తారం :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంతో పాటు కాల్వ శ్రీరాంపూర్, రామగిరి, కమాన్‌పూర్‌తో పాటు ఇతర ప్రాంతాల నుండి ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామ శివారులోని బగుళ్ళ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో కోనేరులో పుణ్యస్నానం ఆచరించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కోటి లింగాలు, హనుమాన్, నాగదేవత గుడి, శ్రీ వెంకటేశ్వర స్వామి, వినాయకుని గుడి, నంది విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఆలయంలోని కోనేరు నీటిలో మునిగితే కాశీ పుణ్యక్షేత్రంలోని గంగా స్నానం చేసినంత పుణ్యమని భక్తులు నమ్ముతారు.

## జాతీయస్థాయి పరీక్షలో పారమిత విద్యార్థుల సత్తా



**ప్రజాపక్షం/కొత్తపల్లి/కరీంనగర్:** ఇటీవల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ నిర్వహించిన జాతీయస్థాయి బౌతికశాస్త్ర పరీక్ష (ఎన్ఎస్ఇపి) పోటీలలో కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చవట వెంకట మోక్షిత్, గంప సహస్రలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ వారు ఫిబ్రవరిలో నిర్వహించే ఐఎన్ఎపిహెచ్‌శో 2026 (ఇండియన్ నేషనల్ ఫిజిక్స్ ఒలంపియాడ్)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ నుంచి దాదాపు 12వేల మంది విద్యార్థులు పాల్గొనగా కేవలం 18 మంది విద్యార్థులు మాత్రమే ఐఎన్‌పిహెచ్‌వో 2026కు అర్హత సాధించగా, అందులో ఇద్దరు పారమిత పాఠశాల విద్యార్థులు కావడం గమనార్హం. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఐఎన్‌పిహెచ్‌శో 2026కు అర్హత సాధించిన విద్యార్థులను గైడ్ టీచర్స్ చంద్రమౌళి శర్మ, శ్రీనివాస్‌లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వియయం ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాములు ప్రత్యేకంగా అభినందించారు.

## జ్ఞాన సరస్వతి ఆలయంలో 'మీనాక్షి' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో కరీంనగర్ నగరంలోని మీనాక్షి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ మేరకు తెలుగు బాష పండిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంబోజి శేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, బాష్యం నవీన్ కుమార్, ట్రస్మా రాష్ట్ర నాయకులు పుల్యాల లక్ష్మారెడ్డి, గుర్రం ఆనందరెడ్డి, తెలుగుబాష పండిత సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి చత్రపతి శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్యాలెండర్ మానవ దైనందిన జీవితంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. కరీంనగర్ నగరంలోని మీనాక్షి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డా.రవి కుమార్, డా. పవన్ కుమార్, డా.సదానందం,ఆస్పత్రి ఇంచార్జి ఎడ్ల కిషోర్, దూస రాము, వ్యాపారవేత్త మల్లారపు రాములు, గుర్రం జనార్దన్ రెడ్డి, బాష్యం శరణ్ ప్రియ, గోసంరక్షకులు కైరి మల్లేశం, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పి.ఆర్.టి.యు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మండల విద్యాధికారి




**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల మానవ వనరుల కేంద్రం వద్ద మండల విద్యాధికారి బండారి మధు పిఆర్‌టియు యూనియన్ నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల అధ్యక్షులు జంగిలి అశోక్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్స్‌కి టెట్ నుండి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డిఏ లను పిఆర్సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని అశోక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర బాధ్యులు బి.చిన్నయ్య, జిల్లా బాధ్యులు ఈగ శ్రీధర్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఉలిసే వెంకటేశ్వర్ రావు, సభ్యులు రమేష్, తిరుపతి నాయక్, అనిల్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలతో ప్రధాన ఆలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోగా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్గొండ గోదావరి నది తీరాన ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామలింగేశ్వర ఆలయంలో వేకువ జాము నుండి భక్తులు ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలోని శివలింగంపై సూర్యకిరణాలు నేరుగా స్వామి వారిపై పడంతో కళ్ళారా వీక్షించి దర్శించుకుని ఈ కార్యక్రమాల్లో భక్తులు , కమిటీల సభ్యులు తదితరులు ఉన్నారు.



**కొత్తపల్లి :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం కరీంనగర్ నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో పరివార సమేత దుర్గాభవానీ అమ్మవారిని ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పూలతో అలంకరించారు. దీపాకాంతుల్లో వెలిగిపోతూ అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణ శర్మ విశేష అభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాద్యులు వంగళ లక్ష్మ ణ్, వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, మాజీ కార్పోరేటర్ వంగళ శ్రీదేవిలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**చొప్పదండి:** మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో ఉదయం 5.15 గంటలకు వివేకానంద యూత్ క్లబ్ నిర్వహణలో ఆలయ అర్చకులు జనగామ సత్యనారాయణ, సింహాచలం ప్రభాకరచార్యులు, మురళీచార్యులు రాఘవులు సమక్షంలో ఉత్తర ద్వార దర్శనం, పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివకేశవ స్వాముల కళ్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారుకార్యక్రమంలో వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు క స్తూరి వెంకటేశం, సెక్రటరీ ఐట్ల మల్లేశం, కోశాధికారి సిరిపురం తిరుపతి, దూస రాము, తాటిపెల్లి అంజయ్య, మామిడాల నిరంజన్, చైర్మన్ గుర్రం నీరజారెడ్డి, బలిజ మల్లిఖార్జున్, పూసాల భూమేష్, కుటుంబ సభ్యులు, తదితరులున్నారు.

## ప్రభుత్వం నుండి విడుదలైన వేతనాలు ఇప్పించాలి

హాస్పిటల్ సానిటేషన్ కార్మికుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ముత్తారం :** మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రి మాత శిశు హాస్పటల్లో సానిటేషన్ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన అక్టోబర్ నెల వేతనాలు ఇప్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో హాస్పటల్ సూపరిండెంట్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ మంథని ఆస్పటల్ మాత శిశు కేంద్రంలో పనిచేస్తున్న సానిటేషన్ ఉద్యోగ కార్మికుల బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బకాయి వేతనాలు విడుదల చేసిందని అందులో అక్టోబర్ నెల వేతనాలు కూడా ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వం విడుదల చేసిన అక్టోబర్ నెల వేతనాలు కార్మికులకు ఇవ్వాలని అదే విధంగా ప్రతి కార్మికునికి పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఉద్యోగ కార్మికులు భారత్, రమాదేవి,లలిత, రాజబాబు,సిఐటియు నాయకులు బాబు,రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అలాగే కుల, మత, భేదాలు తగవని ప్రజలందరూ సమానమేనని సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో గల దళితవాడలో నిర్వహించిన పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలంతా సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను, భారత రాజ్యాంగ విలువలను, రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులను, అంటరానితనం నిషేధంపై అవగాహన తప్పనిసరి అన్నారు. దీనితోపాటు చదువు యొక్క ప్రాముఖ్యత, ఉద్యోగాలలో ఉన్న రిజర్వేషన్స్, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్ బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఏఎస్ఐ సత్తయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రశాంత్, గ్రామ పోలీసు అధికారి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు దాసరి దామోదర్, మహమ్మద్ ఖాజా, రత్న రాజేశ్వరి, కారోబార్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, గ్రామ పాలన అధికారి కుమారస్వామి, సిఆర్పి సమ్మయ్యతో పాటు అంబేద్కర్ కాలనీ ప్రజలు ఉన్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఓదెల మండలలోనీ హరిపురం గ్రామ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్ లు మంగళవారం రోజున మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్ లను శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ, బిఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ముప్పు రాకేష్,ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యుల దాసరి మహేందర్,అనిత ఓదెల,పద్మ కైలేషన్, రాజయ్య, BRS నాయకులు ఉన్నారు.

